క్లుప్తంగా

హైకోర్టు జడ్జిని కలిసిన జిల్లా ఎస్పీ



జడ్జి కృష్ణమోహన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని న్యాయమూర్తులతో నిర్వహించే వర్క్‌షాపుకు హాజరయ్యేందుకు ఏలూరు విచ్చేసిన హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్‌ను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక కలెక్టరేట్ సమీపంలోని రెవెన్యూ భవన్‌లో హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్‌కు ఎస్పీ పుష్పగుచ్ఛం అందజేశారు.

'వాహనాలపై రంగులు మార్చక్కర్లేదు'

ఏలూరు(మెట్రో): ఏలూరు నగరంలో చెత్త సేకరణ వాహనాలపై ఉన్న పచ్చ రంగు తడి చెత్తకు, నీలం రంగు పొడి చెత్తకు, నలుపు రంగు గాజు చెత్తకు సంబంధించినవని, వాటిని తొలగించాల్సిన ఆవశ్యకత లేదని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం ముక్కంటి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరు నగరంలోని బీడీ కాలనీలోని వాటర్ ట్యాంక్ వద్ద ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాగోలు ఉమా ప్రసాద్ పార్టీ సమావేశంలో పాల్గొన్నాడన్నది వాస్తవం కాదని తెలిపారు. సదరు ఫొటో గతంలో తీసినదని, ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత నిర్వహించిన సమావేశం కాదని ముక్కంటి పేర్కొన్నారు.

ఒకటి నుంచి ఏసుక్రీస్తు సువార్త మహాసభలు

దెందులూరు: దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో ఏసుక్రీస్తు సువార్త మహాసభలు నిర్వహించనున్నట్టు పాస్టర్ కె.బెంజిమన్ అన్నారు. శనివారం మన్నా చర్చిలో సంఘస్తులతో కలిసి మహాసభ పోస్టర్ విడుదల చేశారు. ప్రతి రోజూ సాయంత్రం 6.30 గంటలకు 2, 3 తేదీల్లో ఉదయం 11 గంటలకు మన్నా చర్చిలో సభలు జరుగుతాయని విశ్వాసులంతా పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ నేతన్న నేస్తంతో భరోసా

- ఏలూరు నియోజకవర్గంలో రూ.25 లక్షల లబ్ధి
- మగ్గం ఉన్న ప్రతి కార్మికునికీ ఏటా రూ.24 వేల సాయం

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం నేతన్నకు భరోసా కల్పించింది. నేతన్నలు రోజంతా కష్టపడి పనిచేస్తే వచ్చే ఆదాయం రూ.100 నుంచి రూ.200. ఈ ఆదాయంతోనే తమ కుటుంబాలు జీవనం సాగించాల్సిన దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో నెలకు రూ.2 వేలు చొప్పున ఏడాదికి ఒకేసారి రూ.24 వేలు ఆర్థిక సాయం చేయడం చేనేత కార్మికులకు కొండంత అండగా నిలిచింది. వైఎస్ జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర సందర్భంగా రాష్ట్రంలోని చేనేత కార్మికుల దుస్థితిని కళ్లారా చూశారు. వారికి ఇచ్చిన హామీ మేరకు 2019 డిసెంబరు 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా నేతన్న నేస్తం పథకాన్ని అనంతపురం జిల్లా ధర్మవరంలో ప్రారంభించారు. నాటి నుంచి క్రమం తప్పకుండా ఏటా నేతన్న నేస్తం నిధులు రూ.24 వేలు చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఏలూరు నియోజకవర్గం పరిధిలో గత ఐదేళ్లలో చేనేత కార్మికులకు రూ.25 లక్షల మేరకు ప్రయోజనం చేకూరింది. ఏలూరు అర్బన్, రూరల్ పరిధిలోని అర్హులైన 21 మంది చేనేత కార్మికులకు మేలు జరిగింది. జగనన్న హామీ నిలబెట్టుకున్నారంటూ చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మగ్గంపై చీర నేస్తున్న చేనేత కార్మికురాలు

ప్రభుత్వ సాయం మరువలేనిది



రోజురోజుకు క్షీణిస్తోన్న చేనేత కార్మికుల బతుకుల్లో వైఎస్సార్ నేతన్న నేస్తం వెలుగులు నింపింది. ప్రభుత్వం చేస్తున్న సాయం మరువలేనిది. మాస్టర్ వీవర్స్ వద్ద పనిచేసే సొంత మగ్గాలులేని చేనేత కార్మికులకు కూడా నేతన్న నేస్తం అమలు చేయాలి. చేనేతపై విధించిన జీఎస్టీని పూర్తిగా తొలగించాలి. నూలు, రంగులు వంటి వాటిపైనా పన్నులు తగ్గించాలి.

– పిచ్చుక ఆదిశేషు, ఏలూరు జిల్లా కార్యదర్శి, ఏపీ చేనేత కార్మిక సంఘం

ఆదుకున్న నేతన్న నేస్తం



రోజంతా పనిచేసినా కుటుంబ పోషణ గడవని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన నేతన్న నేస్తం పథకం ఎంతో ఆదుకుంది. మా కష్టానికి తోడు ప్రభుత్వం అందిస్తున్న నెలకు రూ.2 వేలు సాయం ఎంతో ఉపయోగపడింది. ఒకేసారి రూ.24 వేలు నేరుగా మా ఖాతాల్లో జమ చేయడం ఎంతో మేలు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు.

– పడాల నాగరాజు, శనివారపుపేట, ఏలూరు

వృత్తికి చేరువ చేశారు



చాలీచాలని రాబడితో చేనేత వృత్తిని వదిలేసి వేరేపనులు చేసుకుందామనుకున్న సమయంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నేతన్న నేస్తం పథకం నేతన్నలను ఆదుకుంది. వారిని వృత్తికి చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. నాడు పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్‌కు చేనేత కార్మికుల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– పేరక వెంకటేశ్వరరావు, శనివారపుపేట, ఏలూరు

సి విజిల్ బ్యానర్ విడుదల



సి విజిల్ అవగాహన బ్యానర్ విడుదల చేస్తున్న ముక్కంటి

ఏలూరు(మెట్రో) : ఎన్నికల నేపథ్యంలో ఎక్కడైనా అక్రమ మద్యం, నగదు, ఇతర బహుమతుల పంపిణీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి ఫిర్యాదులను సి విజిల్ యాప్ ద్వారా సాధారణ ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్‌ఓ ఎం ముక్కంటి అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సి విజిల్ అవగాహన బ్యానర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ముక్కంటి మాట్లాడుతూ ఫిర్యాదుదారుని సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. సి విజిల్‌పై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం ద్వారా ఎన్నికల్లో నగదు, మద్యం, బహుమతులు, అక్రమ రవాణాను అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు వి.మురార్జి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : వేసవి కాలంలో ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. వడదెబ్బ నివారణ మార్గాలు, ఇతర వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై శనివారం స్థానిక కస్తూరిబా మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గోవిందరావు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎక్కువగా ఎండలో ఆడుకోవడం వల్ల అధిక వేడికి శరీరంలో ఉండే నీరు చెమట రూపంలో బయటికుపోయి వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, తీవ్రమైన వడదెబ్బ వల్ల శరీర ఉష్ణోగ్రత పెరగడం, తీవ్రమైన జ్వరం రావడం డీహైడ్రేషన్‌కు గురవడం, వాంతులు అవ్వడం, ఆయాసపడి నీరసించిపోవడం, స్పృహ తప్పిపోవడం వంటి లక్షణాలు ఉంటాయని వివరించారు. వడదెబ్బ నుంచి రక్షించుకోవాలంటే 12 గంటల్లోపు పనులు ముగించి, తిరిగి నాలుగు గంటల తర్వాత చేయడం, ఎక్కువగా కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం, మంచినీరు తీసుకోవడం, లేతరంగు కాటన్ దుస్తులు ధరించడం, తలకు తలపాగా, టోపీ, గొడుగు వాడాలని సూచించారు. పెద్దలు, విద్యార్థులు, గర్భిణులు, చిన్నపిల్లలు ప్రత్యేక జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. వేసవిలో సాధారణ జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే ఆచరించాలని, విద్యార్థులు భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.సునీత, హెల్త్ సూపర్‌వైజర్ గొరిపర్తి శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్త బీబీ జయినాబ్, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారులు, విద్యార్థులు

శ్రీవారి ఘాట్ రోడ్డులో అదుపుతప్పిన కారు

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డులో ఒక భక్తుడి కారు అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లోని బోదెలోకి దూసుకెళ్లింది. అయితే కారులో ఉన్న భక్తులు సురక్షితంగా బయట పడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం. చినవెంకన్న దర్శనార్థం హైదరాబాద్‌కు చెందిన ఒక భక్తుడు కుటుంబంతో కలసి స్విఫ్ట్ డిజైర్ కారులో క్షేత్రానికి విచ్చేశాడు. కొండపైన టోల్‌గేట్ దాటిన తరువాత కారు ఒక్కసారిగా అదుపుతప్పి వెనక్కి వెళ్లిపోయింది. డివైడర్ పై నుంచి దూసుకెళ్లి బోదెలో పడింది. ప్రమాదం జరిగిన సమయంలో అటుగా ఏవిధమైన వాహనాలు రాకపోవడంతో పాటు, కారులో ఉన్న వారికి ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. క్రేన్ సహాయంతో కారును బయటకు తీశారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	18	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	05,07,10
బెండకాయలు	20	కంద	76
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	38
కాకర కాయలు	28-32	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	40	అల్లం	160
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36-40	పాలకూర	10
దొండకాయలు	20	చుక్కకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	26	గోంగూర	08
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణీ	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	11
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	22
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.40	98517	32
ఏలూరు బీహెచ్ఈఎల్	22.10	98503	30
ఏలూరు -తిరుపతి	16.00	4830	36

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): యోగాతో మానవుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగ ఫర్ బెటర్ లైఫ్ పేరుతో 45 రోజులు నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు ముగింపు సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిబాబు మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్రలో మొదటిసారిగా యోగాపై ఒక సర్టిఫికెట్ కోర్సు నిర్వహించి విద్యార్థుల సహకారంతో పూర్తి చేయడం గర్వకారణమన్నారు. కోర్సు సమన్వయకర్త సీహెచ్ ఉదయలక్ష్మి, ఉప సమన్వయకర్త, యోగా ట్రైనర్లను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల అభివృద్ధి, ప్రణాళిక మండలి సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యోగ ద్వారా విద్యార్థులు తమ మానసిక, భౌతిక ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవాలని, తద్వారా సామజికాభివృద్ధి సాధ్యమైతుందని, కోర్సు ద్వారా నేర్చుకొన్న యోగను రోజూ సాధన చేస్తూ ఉండాలని సూచించారు. హేలాపురి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కేబీ రావు మాట్లాడుతూ యోగతో పాటుగా ధ్యానం కూడా నేర్చుకుని విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి ఇటీవల పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందిన సీహెచ్ ఉదయలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యోగా కోర్సు సర్టిఫికెట్ అందిస్తున్న అతిథులు

పోలీస్ సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు

ఏలూరు టౌన్: పోలీస్ శాఖ ఏలూరు జిల్లాలో పనిచేస్తూ పదవీవిరమణ చేసిన సిబ్బందికి ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, పోలీస్ అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. పదవీ విరమణ చేసిన ఏలూరు ట్రాఫిక్ ఎస్సై ఎం నాగేశ్వరరావు, లేరుపాడు ఏఎస్సై కె.హనుమంతరావు, జీలుగుమిల్లి ఏఎస్సై కె.మనోహర్‌కుమార్, ఏలూరు డీఏఆర్ జె.మారయ్య, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ సీతయ్య, ఏలూరు డీపీఓ జూనియర్ అసిస్టెంట్ కె.హేమలతలను ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ అహర్నిశలు ప్రజల కోసం ఎంతో కష్టపడ్డ పోలీస్ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. విశ్రాంతి తీసుకుంటూ, కుటుంబాలతో సంతోషంగా గడపాలని సిబ్బందికి సూచించారు. విశ్రాంత సిబ్బందికి ఏలాంటి ఇబ్బంది వచ్చినా పోలీస్ కుటుంబం అండగా ఉంటుందన్నారు. జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూపరాణి మాట్లాడుతూ పోలీస్ శాఖలో విజయవంతంగా సర్వీస్ పూర్తి చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పెదవేగి డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, ఏఆర్ డీఎస్పీ వీజీ శ్రీహరిరావు, డీసీఆర్‌బీ సీఐ ఎం సుబ్బారావు, ఏలూరు ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు, ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, ఏలూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు నాగేశ్వరరావు, శానం రమేష్ బాబు, సిబ్బంది కుటుంబ సభ్యులు ఉన్నారు.



పదవీవిరమణ చేసిన పోలీస్ సిబ్బందితో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, అదనపు ఎస్పీ స్వరూపరాణి

జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

దెందులూరు: ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం, అభివృద్ధి, సంక్షేమమే కోసం ఐదేళ్లు శ్రమించిన ప్రజానేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని మరోసారి బలపరచాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. శనివారం పోతునూరులో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, సర్పంచ్ బోదుల స్వరూప్ ఆధ్వర్యంలో నేను సిద్ధం.. మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీపురంలో నిర్వహించిన సభలో పద్మశ్రీ మాట్లాడుతూ నవరత్న పథకాలతో పాటు హామీలివ్వని అనేక పథకాలను జగనన్న అమలు చేశారని తెలిపారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసిన వ్యక్తి జగన్ ఒక్కరేనన్నారు. పేద, బడుగు, బలహీన, దళిత, గిరిజన, ముస్లిం మైనార్టీ వర్గాల అభివృద్ధికి వారికి మరింత సంక్షేమ ఫలాలు అందాలని పరితపిస్తూ బడ్జెట్‌లో కోట్లాది రూపాయలు కేటాయించి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం సైతం ఈ రెండు వ్యవస్థలు అమలు చేసే దిశగా ఆలోచన రేకెత్తించారని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణల ద్వారా ప్రజలకు, రాష్ట్రానికి ఎంతో మేలు చేశారని అన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీకి చెందిన అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ఘన విజయానికి రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరిని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పోతునూరు లైబ్రరీ రోడ్డు, సర్పంచ్ వీధి, దళిత వీధి, లక్ష్మీపురంలో నేను సిద్ధం– మా ఊరు సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ డీఎస్‌వీడీ ప్రసాద్ (బజ్జీ), పార్టీ మండల ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు సున్నా ఫణీ, పార్టీ నాయకులు బత్రాజు సత్యనారాయణ, బుద్ధా అర్జున, రమేష్, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పోతునూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, నాయకులు